# తొందరపడకే కోయిలా

## ఎం.ఎల్.సూర్యకాంతం

వైజాగ్ పరిసర ప్రాంతాల్లో టీవీ సీరియల్‌లో నా పాత్రకు షూటింగ్ పూర్తవ్వడంతో హడావుడిగా ఆటోలో రైల్వేస్టేషన్‌కి చేరుకున్నాను. అప్పుడే స్టేషన్‌లోకి వచ్చిన "రత్నాచల్" స్లో అవుతుండగనే జనం ఒక్క సారిగా దూసుకుపోయి సీట్లు వెతుక్కుంటున్నారు.

ప్రయాణీకుల కంటే సీట్లు అమ్ముకునే దళారులే ఎక్కువ ఆక్రమించేస్తున్నారు. నేను ద్వారం ప్రక్కనే కూర్చొని నా ప్రక్కన ఎవరో ఉన్నట్టుగా బ్యాగు, కర్చీఫ్ ఉంచాను. ప్రయాణంలో సరైన తోడు లేకుంటే చాలా చిరాకు.

అదీ కాక ట్రైన్ బయలుదేరే ముందు ఎవరైనా వృద్ధులు ఉంటే ఇవ్వవచ్చని కూడా నా ఆలోచన. అందరికీ సీట్లు దొరికాయి.

నా ఎదురుగా ఒక మార్వాడీ కుటుంబం కూర్చున్నారు. వాళ్ల పిల్లల కళ్లు నా ప్రక్క సీట్లు ఆక్రమించడానికి చూస్తున్నాయి.

ట్రైన్ కదిలి వేగం అందుకుంటుండగా ఓ టీనేజ్ అమ్మాయి, పాతికేళ్ల అబ్బాయి పరుగెత్తి వచ్చి క్యాచ్ చేశారు.

ఆ పిల్ల నిలబడి ఆయాసపడుతుంటే కూర్చో మని సైగ చేసి బ్యాగ్ తీశాను. ఇద్దరూ కూర్చు న్నారు. దగ్గరగా జరిగి మెల్లగా గుసగుసలాడుకుం టున్నారు. భార్యాభర్తల్లా లేరు. ఆ పిల్లని చూస్తే పంజాబ్‌డ్రెస్‌లో విద్యార్థిగానే అనిపిస్తోంది. ముఖంలో పసితనం పోలేదింకా. కాసేపయ్యాక అతనితో అంటున్నది

"దాన్ని తప్పించుకొని వచ్చేసరికి లేటయిపో యిందనుకో" అని నవ్వుతున్నది. ట్రైన్ అన్నవరం దాటుతుండగా "నీకు అసలే అజాగ్రత్త. అవి ఇలాతే.." అంటున్నాడు. నేను బయటికి చూస్తూనే అన్నీ గమనిస్తున్నాను.

బ్యాగ్‌లో నుండి కర్చీఫ్ చుట్టిన కరెన్సీ కట్ట ఒకటి అతనికిచ్చింది. అతను బ్యాగ్‌లో పెట్టుకు న్నాడు. ఎంత అన్నది నాకు తెలియలేదు. ఐదు వేలు కావచ్చు, పదివేలు కావచ్చు. ఇంకా ఆ పిల్ల మెడలో మూడు తులాల చైను, రెండు బంగారు గాజులు, రెండు ఉంగరాలు కూడా ఉన్నాయి. ఇదేదో ప్రేమ వ్యవహారమే అయి ఉండవచ్చనిపిం చింది. ఇంట్లో తెలియకుండా వచ్చి ఉంటుందనేది నా ఊహ.

"ఇలా మగా ళ్లని నమ్మి తల్లిదండ్రుల కళ్లుగప్పి ఇంట్లోంచి వచ్చి వ్యభిచార గృహాలకు అమ్ముడుపోయే విషయం ప్రతిరోజూ పేపర్లలో చూస్తూనే ఉన్నా" ఈ ఆడపిల్లలకు బుద్ధి రాదెందుకో! వీళ్ల పెంపకంలో లోపమా..? సిని మాల ప్రభావమా..? ప్రస్తుత పరిస్థితులను వివ రించి బ్రతుకు విలువని నేర్పని తల్లిదండ్రుల నిర్ల క్ష్యమా..?

ఏది ఏమైనా కొందరమ్మాయిలు డిగ్రీలైతే సంపాది స్తున్నారు గానీ.. ప్రస్తుత మోసపూరిత ప్రేమలను గ్రహించలేక పోతున్నారు. ఫలితంగా ఆత్మహ త్యలు లేదా వ్యభిచార గృహాలకు తరలిపోతు న్నారు.

ఇది తల్లిదండ్రులకు ఎంత బాధాకరమైన విషయం.

తమ పిల్లల జీవితం అందంగా, ఆనందంగా తీర్చిదిద్దాలని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా ఎంతో డబ్బు ఖర్చు పెట్టి చదివిస్తున్నారు. ఈ విషయం వాళ్లకి తెల్సి మోసపోతున్నారే. బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారు కదా" అని నా మనసు కాసేపు ఆవేదనకి లోనైంది.



నా ఆలోచనల్లో నేనుండగనే ట్రైన్ సామర్లకోటలో ఆగింది. అతను ఏదో తేవడానికి క్రిందికి దిగాడు. ఇంతలో ఒక ముస లామె ఎక్కి ఆ ఖాళీ సీట్లో కూర్చోబోయింది.

"ఇక్కడ ఖాళీ లేదు" అందా పిల్ల.

"ఫర్లేదు కూర్చో నీయమ్మా. అతనుకా సేపు నించుంటా డులే అన్నాను.

ఏమనుకుందో నా ప్రక్కకు జరిగి సిటీచ్చింది ఆమెకి.

ఆ అమ్మాయి చేతిని నాచేతిలోకి తీసుకొని "ఎక్కడి వరకూ బేబీ" అన్నాను ఆప్యాయంగా.

నా వైపు ఆశ్చర్యంగా చూసి "హైదరాబాదండీ" విజయవాడలో దిగాలి" అంది.

"నిన్ను చూస్తుంటే మా మేనకోడలు బేబీ గుర్తొచ్చింది" దగ్ధస్వరంతో అని చీర చెంగుతో కళ్లొత్తుకున్నాను.

నా స్పర్శతో ఆత్మీయత గ్రహించింది. "ఆమెకి ఏమైంది ఆంటీ" అంది దిగులుగా.

ఇంతలో అతనొచ్చి ఆ ముసలామెను లేవమన్నాడు.

"కిషోర్ నువ్వు కాసేపు నించో రాదూ.." అంది.

ఆ వృద్ధురాల్ని తిట్టుకుంటూ "సరే" అని గుమ్మం దగ్గరకెళ్లి నుంచున్నాడు.

నేనింకా దిగులుగా ఉండడం చూసి "మీ బేబీకి ఏమైంది ఆంటీ చెప్పనే లేదు" అంది.

"మా బేబీని ఎంతో అపురూపంగా పెంచుకున్నాం. అది కూడా చాలా తెలివైన పిల్ల. ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. హైదరాబాద్‌లో మెడిసిన్‌లో చేర్పించాం. మూడో సంవత్సరంలో ఉండగా "ప్రేమలో చిక్కుకుంది కాబోలు. పోనీ.. మాతో చెప్పినా బాగుండేది అని ఆగాను.

"ఇంతకూ ఏమయ్యిందండీ" అంది సస్పెన్స్ భరించలేనట్టు.

"ఒకరోజు వార్డెన్ నుండి కబురొచ్చింది. హాస్టల్ నుండి చెప్పకుండా వెళ్లిందనీ, మీ ఇంటికి వచ్చేసిందా? లేదా? అనీ",

వెంటనే విజయవాడ నుండీ హడావుడిగా బయలుదేరి వెళ్లి రూమ్‌మేట్స్ ద్వారా ఎంక్వయిరీ చెయ్యగా ఎవరో ఒకతను తరచూ వస్తుండేవాడని, అతను హైటెక్ సిటీలో "ఒక కంపెనీలో జాబ్ చేస్తున్నాడనీ చెప్పిందిట. అతన్ని రంజిత్ అని పిల్చేదని చెప్పారు.

మాకు తెలిసి ఆ పేరు గల వాళ్లెవరూ లేరే అని ఆశ్చర్యపోయాం.

ఆ కంపెనీ అడ్రస్‌కి వెళ్లి కనుక్కుంటే ఆ పేరు గల వాళ్లెవరూ లేరని చెప్పారు.


ఎంతో అపురూపంగా.. ప్రేమగా చూసుకున్న మా బేబీ మమ్మల్ని మోసం చేసిందన్న నిజాన్ని తట్టుకోలేకపోయాం. పోనీలే. తనకు నచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకుందేమో. కనీసం తర్వాత కూడా ఉత్తరం వ్రాయడమో" ఫోన్ చేయడమో జరిగినా బాగుండేది.


'ఇంత స్వార్థపరులా పిల్లలు' అని చాలా బాధ కలిగిందమ్మా. ఆ బాధతో మీ అంకుల్, నేను కూడా జీవితంపై విరక్తినే పెంచుకున్నామనుకో. అది ఎక్కడో అక్కడ సుఖంగా ఉంటే చాలని ఆ భగవంతుడిని రోజూ ప్రార్థించే దానిని.

"ఒకరోజు" అంటూ దుఃఖపూరితమైన గొంతుతో మాట్లాడలేక ఆగిపోయాను.

"బేబీ...వచ్చేసిందా" ఆ పిల్ల ముఖంలో ఆతృత.

"పోలీస్ స్టేషన్ నుండి కబురొచ్చింది మాకు. బొంబాయిలోని వేశ్యాగృహాలపై దాడి జరిగినప్పుడు కొందరు ఆడపిల్లల్ని ఒక స్వచ్ఛంద





## ఆదర్శభర్త

భార్యకి అనారోగ్యం వస్తే షూటింగ్‌లు క్యాన్సిల్ చేసుకోవడం చాలా అరుదు. ఎందుకంటే భార్యని హాస్పిటల్లో జాయిన్‌చేసేసి ఎంచక్కా షూటింగ్స్‌లో పాల్గొంటుంటారు హీరోలు. అయితే వీరందరికంటే భిన్నమైన జీవనశైలి కలిగిన నటుడు షారూఖ్. ఛల్తే ఛల్తే షూటింగ్ సందర్భంగా షారూఖ్ భార్య నిర్మల అనారోగ్యంతో ఉండడంతో షూటింగ్‌లో పాల్గొడానికి చాలా ఇబ్బందిపడ్డాడట. షూటింగ్‌ని క్యాన్సిల్ చేసుకునే అవకాశం ఉన్నా దానిని వినియోగించుకోకుండా సిన్సియర్‌గా షూటింగ్స్‌కి హాజరై మిగిలిన సమయాన్ని హాస్పిటల్‌లో భార్య చెంతనే ఉండిపోయాడట. ఇందుకోసం లండన్‌లో జరిగే ఆ చిత్రం ప్రీమియర్ షోకి వెళ్ళే ప్రోగ్రాంని క్యాన్సిల్ చేసుకున్నాడట. నిర్మల ఇప్పుడు షారూఖ్‌ని మంచి భర్తగా ట్రీట్‌చేస్తోంది. సినిమాలోనే కాదు నిత్యజీవితంలో కూడా రియల్‌హీరో అని షారూఖ్‌కి అంతా కితాబులిస్తున్నారు.

సంస్థకు అప్పగించగా మా బేబీ మోసపోయిన విధం చెప్పి నన్నెలాగైనా విజయవాడలోని మా తల్లిదండ్రుల దగ్గిరకు చేర్చమని బతిమాలిందిట. అలాంటి దుస్థితిలో బేబీ ఉన్నందుకు విచారించాలో ఆచూకీ తెలిసినందుకు సంతోషపడాలో అర్థం కాలేదు. కన్నబిడ్డపై మమకారం, పేగు బంధం తెంచుకోలేక పోలీసుల ద్వారా మా బేబీని తెచ్చుకున్నాం.

గతాన్ని మరిచి మళ్లీ కొత్త జీవితం ప్రారంభించమనీ,.. మరలా చదువుకోమనీ ప్రోత్సహించాం'' అని ఆగాను.

"అంటే అయితే బేబీ ఇప్పుడు మీ దగ్గరే ఉందన్నమాట'' అంది రిలీఫ్‌గా.

"లేదమ్మా జాగ్రత్తగా విను. ఒకసారి షాపింగ్ కెళ్తే అతను పరిచయమయ్యాడట. హైటెక్ సిటీలో ఇంజనీర్‌ననీ ఇక్కడ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాననీ పరిచయం పెంచుకుని మెల్లగా ప్రేమలోకి దించాడట.

"చదువయ్యాక పెళ్లి చేసుకుందాం'' అంటే ఈ విరహం నేను భరించలేను డియర్'' అని వగలు బోయాడుట.

"మా పేరెంట్స్ ఇప్పుడు పెళ్లంటే ఒప్పుకోరు'' అన్నా సరే.

"నువ్వు తర్వాతయినా చదువుకో'' నేనే చదివించుకుంటాను.

మా కంపెనీకి బొంబాయిలో శాఖ ఉంది. అక్కడ జాబ్‌కి ట్రై చేశాను. వెళ్లిపోయి అక్కడే పెళ్లి చేసుకుందాం'' అని నమ్మించి తీసుకుపోయాడుట.

దీని ఖర్మ అలా రాసి ఉంటే నమ్మకేం చేస్తుంది. మేము ఖర్చులకు, ఫీజుకి పంపిన పదిహేను వేల రూపాయలూ అందుకొని అతనితో వెళ్లిపోయింది. కనీసం ప్రేమ సంగతి స్నేహితురాళ్లకైనా చెప్పలేదు.

అతనే ఎవరికీ చెప్పొద్దన్నాడుట. అక్కడికెళ్లాక ఏభైవేలకి వ్యభిచార గృహంలో అమ్మేసాక గానీ అసలు మోసం తెల్సుకోలేక పోయిందిట.

బిడ్డని దక్కించుకున్నామన్న సంతోషం లేకుండా "అంటూ వెక్కివెక్కి ఏడుస్తున్న నన్ను ఆ పిల్ల "ఊరుకోండి ఆంటీ'' అంది ఓదార్పుగా.

"ఎలా ఊరుకోగలనమ్మా'' నలతగా ఉంటున్నదని డాక్టరు దగ్గరుకి తీసుకెళ్లి అన్ని టెస్టులూ చేయించాం. అప్పుడు తెలిసింది''

"ఏమని?'' చెప్పలేనంత ఆందోళన ఆ పిల్లకన్నుల్లో.

"ఏమని చెప్పను. అంతా మా ఖర్మ, మా దురదృష్టం తల్లీ. మా బంగారుతల్లికి భయంకరమైన ఎయిడ్స్ సోకింది'' అంటూ కారే కన్నీటిని తుడుచుకున్నాను.

"దాని ఆయుష్షు కొంత కాలమే అన్న భావన గుండెల్ని చీల్చేస్తున్నా "ఎంత జాగ్రత్తగా కాపాడుకున్నా'' చివరికి "అవి'' ఆ వ్యాధితోనే మమ్మల్ని విడిచి వెళ్లిపోయింది'' అని విచారంగా కళ్లు మూసుకుని వెనక్కి జారగిలబడ్డాను.

"అంతసేపూ శ్రద్ధగా విన్న ఆ అమ్మాయి మొహంలో ఏదో తెలియని ఆందోళన, నన్ను ఇంకేమీ ప్రశ్నించలేదు.

దీర్ఘంగా ఆలోచిస్తూ దిగులుగా కూర్చుండిపోయింది.

"చూడమ్మా'' నా బిడ్డ గుర్తొచ్చి ఇలా చెప్పాల్సి వచ్చింది. అనవసరంగా నిన్ను బాధపెట్టాను.

సారీ నువ్వెప్పుడైనా విజయవాడ వస్తే మా ఇంటికి తప్పకుండా రా, నేను నీ అమ్మలాంటిదాన్నే అనుకో'', అని నా అడ్రసు, ఫోన్ నెంబరు ఓ కాగితంపై వేసి ఇచ్చాను.

రాజమండ్రి వచ్చాక ఆ ముసలామె దిగిపోయింది. ఆ కుర్రాడొచ్చి కూర్చున్నాడు, ఏదో టిఫిన్ తినమంటున్నాడు "వద్దు'' అని ముభావంగా ఉండిపోయింది. ఇందాకటి ఉత్సాహం ఇప్పుడు లేదామెలో.

***

విజయవాడలో ట్రైన్ దిగాక ఆ పిల్ల చెయ్యి పట్టి చిన్నగా ఆప్యాయంగా నొక్కి వదిలేశాను. అతను నా వైపు కొరకరా చూశాడు.

"పద రత్నా'' అంటూ లాక్కుపోతున్నాడు.


అప్పుడు గుర్తొచ్చింది పేరైనా అడగలేదని. బహుశా రత్నకుమారో ఏదో అయి ఉంటుందనుకున్నాను.

డైనింగ్ టేబుల్ దగ్గర సంగతంతా చెప్తుంటే మా వారు, పిల్లలు పడీపడీ నవ్వారు.

"భలే మమ్మీలే'' మొత్తానికి నీ సీరియల్ కారెక్టరంతా ఒరిజనల్‌గా నటించావన్న మాట'' అంది సుష్మ.

"మీ మమ్మీ చిన్న రచయిత్రి కూడా కదా. నాలుగు డైలాగులు ఎక్కువే చెప్పి ఉంటుంది'' అన్నారు శ్రీవారు.

"అవును. ఆ అమ్మాయి అలా వెళ్లేది అయితే తప్పక అంతర్మథనంతో తిరిగి వెళ్లిపోతుంది అని నా ఆశ. వెర్రోడిరాయిలా వేశానంతేనండీ'' అని



లేచాను.

★★★

చీకటి తెరలు విడిపోతుండగానే కాలింగ్ బెల్ మోత. అప్పుడే పాలవాడు వచ్చేశాడా అనుకుంటుండగానే ఆయన లేచి వెళ్లారు. మరికాస్సేపు కళ్లు మూసుకుందామన్న ప్రయత్నాన్ని భగ్నం చేస్తూ "సుజా నీ రాయి గురిచూసి వేసినట్టే తగిలినట్టుంది'' అంటూ బెడ్‌రూమ్‌లోకి నవ్వుతూ వచ్చారు.

నేను బాత్రూంకైనా వెళ్లకుండా ఆత్రంగా హాల్లోకి వెళ్లాను.

"ఆశ్చర్యం, ఆనందం... ఆ అమ్మాయే..రత్న''

నన్ను చూసి గబగబా కంగారుగా లేచి వస్తున్న ఏడుపును ఆపుకుంటున్నది.

పరిస్థితి గమనించి దగ్గరగా వెళ్లి ఓదార్పుగా తలపై చెయ్యి వెయ్యగానే వెక్కివెక్కి ఏడుస్తూ రెండు చేతులతో ముఖం కప్పుకుంది. నెమ్మదిగా భుజం తట్టి సోఫాలో కూర్చోబెట్టి విషయం సేకరించాను.

★★★

వైజాగ్‌లో రత్న ఫ్రెండ్స్‌తో కలిసి ఒక ఫ్లాట్‌లో ఉండి చదువుకుంటోంది.

ఎదుటే ఫ్లాట్‌లోని యువకుడితో పరిచయం కాస్తా ప్రేమగా మారి స్నేహితురాళ్ల కళ్లుగప్పి, ఖర్చులకని పంపిన డబ్బులతో ఇద్దరూ హైదరాబాద్ పోయి పెళ్లి చేసుకోవాలని, ఆపై ఏదైనా ఉద్యోగం చేసుకోవచ్చని అతను ప్లానింగ్ వేశాడట. అతనికి అక్కడ ఏవో ఆస్తులున్నాయంటే నమ్మిందిట.

**విజయవాడలో** ట్రైన్ దిగాక లాడ్జిలో ఉంచాక ఇద్దరు వ్యక్తులు వచ్చి పరిశీలనగా చూడటం, బాల్కనీలోకి **వెళ్లి నెమ్మదిగా** మాట్లాడుకుంటూ తర్జనభర్జనలు పడటం ఆమెకి సందేహం వచ్చిందిట.వాళ్లు వెళ్లిపోయాక-

"మెడలో చైను, గాజులు తీసెయ్యి జాగ్రత్త పెడతాను ఇక్కడ దొంగలుంటారు'' అనటంతో ఇదేదో మోసమే అని తెలుసుకుని, ట్రైన్‌లో సుజాత గారు చెప్పిన బేబీ కథ కూడా గుర్తొచ్చి అతనికి అనుమానం రాకుండా తెల్లవారుజామున తప్పించుకొని ఆటో వాడి సాయంతో ఇక్కడికి చేరానని చెప్పింది.

చూడమ్మా రత్నా! ఇప్పటికైనా నీ బుర్ర పనిచేసినందుకు సంతోషం.

చదువంటే పుస్తకాల్లో ఉన్నదే కాదు. జీవితాన్ని, నేటి పరిస్థితులనూ అర్థం చేసుకొని మనం వేసే ప్రతి అడుగూ ఒకటికి పదిసార్లు ఆలోచించి మరీ వెయ్యాలి.

ఆ కుర్రాడు మంచివాడే అయినా చదువు మధ్యలో ఆపేస్తున్నావు కదా. రేపు ఏం జరిగినా ఎలా బ్రతకగలవు? ఏం జాబ్ వస్తుంది? అమ్మనాన్నల బాధ ఏమిటి? అసలు అతని కుటుంబ నేపథ్యం ఏమిటి? ఏం చదివాడు? ఏం చేస్తున్నాడు?

అతను చెప్పేది ఎంతవరకు నిజం? అన్న నిజనిజాలు తెల్సుకోకుండా అతనితో వెళ్లిపోవడం ఎంత అవివేకం.

చదువు సంస్కారాన్ని, తెలివితేటల్ని పెంచాలి గానీ.. దిగజార్చకూడదమ్మా. ఆపోజిట్ సెక్స్ పట్ల ఆకర్షణ కలగటం సహజమే కానీ మంచి చెడులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఆడైనా, మగైనా కూడా ఒక తప్పటడుగు వేస్తే జీవితకాలం శిక్ష అనుభవించాలి.

అయినా నీకంత ప్రియమైన వ్యక్తి అయితే అమ్మనాన్నలతో సంప్రదించవద్దా..? నీ బాగోగులు వాళ్లకంటే ఎవరికి కావాలి?

అతను యోగ్యుడైతే వాళ్లు దగ్గరుండి నీ పెళ్లి జరిపించరా...!'' అన్నాను మందలింపుగా.

"అవును మేడం. నేను ఇంత ఆలోచించలేకపోయాను.

నన్ను వేరే ఆలోచనే లేకుండా చేశాడు. అతను లేకుండా బ్రతకలేననిపించింది.

ఇప్పుడు మీ మాటలు వింటుంటే నేనెంత బుద్ధిహీనురాలినో అర్థమవుతోంది'' అంది సిగ్గుపడుతూ.


"తెలివి తక్కువ ఆడపిల్లలు అతని రూపం, మాటలు చూసి అంతా నిజమని నమ్ముతుంటారు. ఎన్నో అనర్థాలు జరుగుతున్నట్టు వింటున్నా చూస్తున్నా కూడా.. ఇంకా కొందరిలో చైతన్యం రావడం లేదు'' అన్నాను బాధగా.

"అవును మేడం. నేనెంత తప్పు చేశాను. మీరు కలవకుంటే నా బ్రతుకు ఏమయ్యేదో ఇప్పుడు అమ్మానాన్నలకు నా మొహం చూపలేను'' అని ఏడుపు మొదలెట్టింది.

"ఇక ఏడుపు ఆపు. మీ పేరెంట్స్ గొడవ నే చూస్కుంటా గానీ పద లోనికి'' అన్నాను.

నా కట్టుకథ ఒక యువతి జీవితాన్ని కాపాడినందుకు మనసారా ఆనందించి, ఆమె తల్లిదండ్రులకు కబురంపే యత్నంలో లేచాను.

★



## కొండచిలువతో బాలుడి స్నేహం

కాంబోడియాలోని ఒకామె తన నాలుగు సంవత్సరాల కొడుకు ఓ రోజు తను పని నుండి వచ్చేసరికి ఓ కొండచిలువతో ఆడుకుంటున్నాడనీ, ఆ దృశ్యం తను చూసి భయపడిందని చెప్తోంది. వర్కింగ్ ఉమెన్ అయిన ఆమె డ్యూటీ ముగించుకుని వచ్చేసరికి తన కొడుకు నాలుగుమీటర్ల పొడవున్న ఓ పెద్ద కొండచిలువతో ఆటలాడుకుంటూ కనిపించాడని చెప్పింది. ఈ విచిత్రం చూసిన ఆమె తన బాబు జాతకం చూపిస్తే అతను పూర్వ జన్మలో విశిష్ట వ్యక్తి అని, కారణజన్ముడని చెప్పారట. ఈ విచిత్రం చూడ్డానికి అక్కడి ప్రజలు తండోపతండాలుగా విచ్చేస్తున్నారట. అతను దేవుడని కూడా మొక్కుకుంటున్నారట. ఈ భక్త జనం బారి నుండి ఎలా తప్పించుకోవాలో అర్థం కానీ ఈమె నానా అవస్థలూ పడుతోందిట. ఆ బాబు మాత్రం ఆ కొండచిలువ మీదే పడుకుని, దాని పక్కనే తింటూ, స్నానం చేస్తూ ఆడుకుంటున్నాడట.

-శశి

